క్లుప్తంగా

మార్చి 9న లోక్ అదాలత్

వాల్మీకిపురం: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణంలో మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ జూనియర్ సివిల్ జడ్జి జ్యోతి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ కక్షిదారులు రాజీ మార్గం ద్వారా వారి కేసులను పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ చక్కటి వేదిక అని తెలిపారు. సివిల్, క్రిమినల్ తదితర కేసులు ప్రీ సిట్టింగ్స్‌లో కూడా రాజీ చేసుకోవచ్చునని తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



అంకురార్పణ కార్యక్రమంలో టీటీడీ ఈఓ వరలక్ష్మి తదితరులు

తంబళ్లపల్లె: కోసువారిపల్లెలో వెలసిన శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణచేసి సంప్రదాయబద్ధంగా టీటీడీ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు వేదపండితులు స్వామివారి దర్శనం కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. శనివారం ధ్వజారోహణం కనువిందుగా నిర్వహించనున్నారు. భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశ్యాంత్‌కుమార్, వేదపండితులు పాల్గొన్నారు.

నూతన నియామకం

బి.కొత్తకోట: బీజేవైఎం మండల అధ్యక్షులను నియమించినట్లు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గోరంట్ల రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బి.కొత్తకోట అధ్యక్షుడిగా సంతోష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తిరుమలేష్ విశ్వనాథ్, ములకలచెరువు అధ్యక్షుడిగా సాయి, ప్రధాన కార్యదర్శిగా మోక్షిత్, పీటీఎం అధ్యక్షుడిగా జే.రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా పి.కిరణ్ నియమితులైనట్లు తెలిపారు.

మద్యం ప్యాకెట్ల పట్టివేత

పెద్దతిప్పసముద్రం: మండలంలోని టి సదుం సమీపంలో ఎస్ఐ రవీంద్రబాబు సిబ్బందితో కలసి శుక్రవారం నాకాబందీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో టి సదుంకు చెందిన కార్తీక్ (29) అనే వ్యక్తి కర్ణాటక రాష్ట్రం నుంచి బస్సులో 48 మద్యం ప్యాకెట్లను తరలిస్తూ పట్టుబడగా కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.


నాటుసారా స్థావరాలపై పోలీసుల దాడులు

కలికిరి : మండలంలోని గుట్టపాళెం పంచాయతీలో నాటుసారా స్థావరాలపై పోలీసులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు శుక్రవారం సీఐ మోహన్ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. జి.బరిణేపల్లె సమీపంలోని అటవీ ప్రాంతాల్లో సారా బట్టీలు గుర్తించి ధ్వంసం చేశారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. సారా తయారీ, విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఎస్ఐ మధుసూదనాచారి, హెచ్‌సీలు మదనమోహన్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, కొండప్ప పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

మదనపల్లె: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ ఎస్ శేఖర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు చీకలబైలు చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా, కర్ణాటక రాష్ట్రం బెంగళూరు మహాలక్ష్మిపురం కు చెందిన నాగేంద్ర కుమారుడు ఎస్ దీపక్ (35), కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. అతని వద్ద నుంచి రూ. 1440 విలువ గల రెండు ఫుల్ బాటిల్స్ కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా ప్రకాశం జిల్లా కోవెలంపాడు కు చెందిన చిన్నపరెడ్డి కుమారుడు శివారెడ్డి (35), 10 కర్ణాటక బీర్లు తరలిస్తుండగా అతని వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటి విలువ రూ. 1750 ఉంటుందని తెలిపారు. నిందితులు ఇద్దరిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ మహబూబ్‌బాషా

పీలేరు రూరల్ : మండలంలోని జగనన్న కాలనీల్లోని ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలని తహసీల్దార్ ఎస్. మహబూబ్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 6367 ఇళ్లు ఉన్నాయని, ఇప్పటి వరకు 406 రిజిస్ట్రేషన్లు అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి, ఆర్ఐ చాణక్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి

- వలసపల్లెను అభివృద్ధిలో నెం.1గా నిలుపుతాం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే నియోజకవర్గ అభివృద్ధి
- చంద్రబాబు మాటలు నమ్మి మోసపోవద్దు
- మంచి చేసిన ప్రభుత్వాన్ని గెలిపించుకుందాం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దేశాయ్‌తిప్పారెడ్డి

మదనపల్లె : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కుల,మత,పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం మదనపల్లె మండలం వలసపల్లెలో సర్పంచ్ సరస్వతమ్మ, నాయకులు నాగరాజరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, బి.నరేష్‌కుమార్ రెడ్డి, నిసార్‌అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డిలకు గ్రామస్తుల నుంచి ఘనస్వాగతం లభించింది. మొదట గ్రామంలోని గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం నాయకులు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే దేశాయ్‌తిప్పారెడ్డి మాట్లాడుతూ... ఐదేళ్లలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబాన్ని తన కుటుంబంగా చూసుకుంటూ, అందరికీ మేలుచేయాలని పరితపించారన్నారు. రెండేళ్లు కరోనాతో ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ, నవరత్నాల పథకాల అమలులో ఎక్కడా జాప్యం కలగకుండా, చెప్పిన సమయానికి చెప్పినట్లుగా అన్ని పథకాలను అమలుచేసి అందరి మెప్పు పొందారన్నారు. వలసపల్లె గ్రామానికి తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నవోదయాకాలనీకి చేతనైన సహాయం చేశానన్నారు. నియోజకవర్గంలో కేవలం రెండుచోట్ల మహానేత వైఎస్సార్ విగ్రహాలు ఉంటే, అందులో ఒకటి వలసపల్లె అని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా విగ్రహావిష్కరణ జరగడం విశేషమన్నారు. టీడీపీ, ఇతర ప్రభుత్వాలతో పోలిస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే మదనపల్లె నియోజకవర్గం గణనీయంగా అభివృద్ధి చెందిందన్నారు. మదనపల్లె మెడికల్ కాలేజీ, బీటీ కళాశాల ప్రభుత్వపరం, ప్రతి గ్రామానికి సీసీ రోడ్లు తదితర అనేక అభివృద్ధిపనులు జరిగాయన్నారు. చంద్రబాబు 2014లో 600 అబద్ధపుహామీలిచ్చి ఒక్కటీ నెరవేర్చిన పాపాన పోలేదన్నారు. జగనన్న మాట ఇస్తే...వాటిని నెరవేర్చేంతవరకు విశ్రమించరన్నారు. ప్రజలకు చెప్పినదాని కంటే ఎక్కువ చేయాలన్న తపన ఎక్కువన్నారు. ప్రజలందరి ఆశీస్సులతో ప్రజాప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకుని జగనన్నను సీఎం చేసుకుందామన్నారు. మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ..చంద్రబాబు ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యులు ప్రతిపాదించిన వారికే ప్రభుత్వ పథకాలు అందేవని, జగనన్న ప్రభుత్వంలో వలంటీర్, సచివాలయ వ్యవస్థతో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటివద్దకే పథకాలు అందుతున్నాయన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ.. వలసపల్లె పంచాయతీతో తనకు చిన్నప్పటి నుంచే అనుబంధం ఉందన్నారు. స్థానికంగా తమకు భూములు ఉండటంతో, ఇక్కడి ప్రజలతో తమ కుటుంబానికి పరిచయాలు ఉన్నాయన్నారు. వలసపల్లెను అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం కనపరిచారన్న సర్పంచ్ సరస్వతమ్మ, నాయకులు నాగరాజరెడ్డిని సముదాయిస్తూ, వలసపల్లెను గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. సంక్షేమ పథకాలు కలకాలం కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జన్నే రాజేంద్రనాయుడు, సుబ్బయ్యనాయుడు, మస్తాన్ రెడ్డి, సురేంద్ర, కోటూరిఈశ్వర్, సర్పంచ్‌లు శరత్‌రెడ్డి, ఈశ్వరయ్య, కౌన్సిలర్‌లు ప్రసాద్‌బాబు, ముబీనా, సలీం, ఆర్టీఏ నూర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి



ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ములకలచెరువు: అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిన ఘనత వైఎస్సార్‌సీపీదేనని తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. గడప, గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని మద్దినాయునిపల్లి పరిధిలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ప్రజా సమస్యలను ఆలకిస్తూ వాటిని పరిష్కరించే దిశగా అధికారులను ఆదేశిస్తూ ముందుకు సాగారు. ప్రజలు అడుగడుగునా ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. మూడు చోట్ల ప్రభుత్వ తాగునీటి బోర్లకు ట్రాన్స్‌ఫార్మర్లు కావాలని విన్నవించారు. సిమెంటు రోడ్లు, తారు రోడ్డు మంజూరు చేయాలని పలువురు కోరారు. కొండ్లమాలపల్లిలో కిడ్నీ సమస్యతో ఇబ్బంది పడుతున్న సిరంగి రవనమ్మ అనే ఓ చిన్నారిని ఆప్యాయంగా పలకరించి కొంత నగదు సాయం చేశారు. అలాగే మెరుగైన వైద్యం అందించేలా కృషి చేస్తానని చిన్నారి కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జగనన్న పాలనలో నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందిందన్నారు. మళ్ళీ ఈ ప్రభుత్వం అధికారంలోకి రావాలంటే జగనన్నను మనమంతా ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేద్దామన్నారు. ఆయన వెంట ఎంపీపీ సాయిలీలా, జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, సర్పంచ్ క్రిష్టప్ప, ఎంపీటీసీ సుధాకర్‌నాయుడు, నాయకులు సుబ్బిరెడ్డి, బయారెడ్డి, కేశవరెడ్డి, బాబురెడ్డి, జీకే శ్రీనివాసులు, జగన్నాథం, ప్రతాప్‌రెడ్డితో పాటు మండల, గ్రామ స్థాయి నాయకులు, ప్రజా ప్రతినిధులతో పాటు అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు

జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్



మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్

పీలేరు : పీలేరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సెక్టోరియల్ అధికారులు ఎన్నికలకు సంసిద్ధం కావాలని ఆదేశించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు తప్పనిసరిగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సెక్టోరియల్ అధికారి తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాన్ని విధిగా పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల నమోదు అధికారి ఎస్. రమా, తహశీల్దార్లు ఎస్. మహబూబ్‌బాషా, విజయకుమారి, ప్రదీప్, నయాజ్‌అహ్మద్, ఖాతిజున్‌కుప్రా తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించండి

కలికిరి : పోలింగ్ కేంద్రాల్లో సరైన ఏర్పాట్లు ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలో 186, 187, 188, 200 నుంచి 209వరకు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సెక్టోరియల్ అధికారులు ఎన్నికలకు సంసిద్ధం కావాలని ఆదేశించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వికలాంగులకు అనువుగా ర్యాంప్ తప్పనిసరిగా ఉండాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ప్రతి సెక్టోరియల్ అధికారి తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ విజయకుమారి, సెక్టోరియల్ అధికారులు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డ్ చైర్మన్‌కు ప్రశంసాపత్రం



మంత్రి చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న కరీముల్లా

మదనపల్లె : హర్ దిల్ మే వైఎస్సార్ – హమ్ సబ్ జగన్‌కే సాత్... వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ ఔట్ రీచ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో విశేష కృషి చేసినందుకు జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ ఎస్.ఏ.కరీముల్లాకు వైఎస్సార్ సీపీ మైనారిటీ వింగ్ నుంచి ప్రశంసాపత్రం లభించింది. శుక్రవారం తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ఎస్.ఏ.కరీముల్లా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రప్రభుత్వం ముస్లిం, మైనారిటీల కోసం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అన్నమయ్యజిల్లాలో విస్తృతంగా ప్రచారం చేయడమే కాకుండా ప్రతి ముస్లిం కుటుంబానికి అవగాహన కల్పించినందుకు తనకు ప్రశంసాపత్రం అందించారన్నారు. ముస్లిం మైనారిటీల పక్షపాతి ప్రభుత్వంగా వైఎస్సార్ సీపీ మరోసారి ఘనవిజయం సాధించేందుకు తమ సంపూర్ణ సహాయ సహకారాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హజ్‌కమిటీ డైరెక్టర్ ఖాదర్‌బాషా, ఇరిగేషన్ డైరెక్టర్ దండాలరవిచంద్రారెడ్డి, కాణిపాకం ఆలయకమిటీ డైరెక్టర్ నరసింహులుశెట్టి తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి

కురబలకోట: టమాటా సాగులో మెలకువలు, జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్త డాక్టర్ ఎంజి బాలా హుస్సేన్ అన్నారు. శుక్రవారం అంగళ్లులో స్పిక్, గ్రీన్ స్టార్ ఫర్టిలైజర్స్ ఆధ్వర్యంలో టమాటా సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఏ పంట వేసినా వేయకున్నా టమాటాను మాత్రం ఇష్టంగా సాగు చేస్తారన్నారు. ఇది నిత్యపంట. ఏ సీజన్‌లోనైనా పండించవచ్చన్నారు. నీటి యాజమాన్యంతో పాటు ఎరువులు పురుగు మందుల వాడకం కీలకమన్నారు. నేల స్వభావం కూడా దిగుబడిపై ప్రభావం చూపుతుందన్నారు. సీనియర్ సైంటిస్టు శశికిరణ్ మాట్లాడుతూ భూమిలో తేమను బట్టి నీటి తడులు ఇవ్వాలన్నారు. మార్కెట్ అంచనాలను గమనిస్తూ డిమాండును పసిగట్టి ఈ పంట సాగు చేస్తే లాభాలను పండిస్తుందన్నారు. స్పిక్ కంపెనీ ప్రతినిధులు ఎస్ఎస్ఎం శివకుమార్,ఆర్ఎం. గంగాధర్, ఎండీఏం.శివ శంకర్, ఎస్ఓ. నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎం.గొల్లపల్లె ఉరుసు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న నిస్సార్ అహమ్మద్

రామసముద్రం: రామసముద్రం మండలం ఎం.గొల్లపల్లె గ్రామంలో ఉన్న షేక్ సింఖింద్ హజ్రత్ హకీమ్‌సాబ్ అలీబాబాదర్గా 773వ సంవత్సరం ఉరుసు ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ హాజరైయ్యారు. ఆయనకు నాయకులు, ముస్లిం మత పెద్దలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం దర్గాలో పూజలు నిర్వహించి, ప్రార్థనలు చేశారు. అలాగే అన్నదాన కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం రాత్రి గంధోత్సవం, కర్ణాటక బృందం వారిచే ఖవ్వాలీ కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాను విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ఎం.గొల్లపల్లి గ్రామం దర్గాకమిటీ సభ్యులు వారి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. దర్గా వేడుకల్లో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కరీముల్లా, ఎంపీపీ కుసుమకుమారి, సింగిల్‌విండో చైర్మన్ కేశవ రెడ్డి, కన్వీనర్ నంద, నాయకులు ప్రకాష్, మునవర్‌బాషా, సుజ్ఞానమూర్తి, భాస్కర్‌గౌడు, తిమ్మయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తెస్తాం



ఎంపీ మిథున్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేస్తున్న షమీమ్‌అస్లామ్

మదనపల్లె : వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తెచ్చేందుకు, జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకునేందుకు తనవంతు కృషి చేస్తానని ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీమ్‌అస్లామ్ అన్నారు. శుక్రవారం ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని కలిసి తనకు రెండోసారి ఏపీఎండీసీ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి తన సేవలను గుర్తించి, ఏపీఎండీసీ పదవికి తనను ప్రతిపాదించినందుకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు.

నిబంధనలు పాటించాలి

వాల్మీకిపురం: ప్రతి ఒక్క వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ పులి శేఖర్ అన్నారు. శుక్రవారం స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో వాహనదారులకు, డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఆటోలకు స్టిక్కరింగ్, పోలీస్ నెంబరు, ఇన్సూరెన్స్, ట్యాక్స్ తప్పనిసరిగా పాటించాలన్నారు.

రహదారి భద్రత.. జీవితానికే రక్ష



మాట్లాడుతున్న ఎంవీఐ టి. విజయకుమారి

పీలేరు : రహదారి భద్రత.. జీవితానికే రక్ష అని ఎంవీఐ టి. విజయకుమారి, సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఎంవీఐ కార్యాలయంలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2023లో 699 ప్రమాదాలు జరిగితే 365 మంది చనిపోయారని, 912 మంది క్షతగాత్రులయ్యారన్నారు. అందులో ద్విచక్రవాహనదారులు 212 ప్రమాదాలు జరిగితే 102 మంది చనిపోవడం జరిగిందన్నారు. ఎక్కువగా హెల్మెట్ ధరించని వారు చనిపోయారని తెలిపారు. సినీ హీరోలు, క్రీడాకారులు, రాజకీయ నాయకుల కుమారులు కూడా హెల్మెట్ ధరించకుండా ర్యాష్ డ్రైవింగ్ చేసి మృతి చెందిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి ద్విచక్రవాహన దారుడు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌తో మాట్లాడుతూ వాహనాలు నడపరాదని తెలిపారు. అనంతరం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం కుమార్, షీ సంస్థ అధ్యక్షురాలు పి.వి.ఎస్. లక్ష్మి, కంటి వైద్యులు డాక్టర్ ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య నివారణకు చర్యలు

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో వైస్ ఎంపీపీ వెంకట్రమణ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను వేగవంతం చేసి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ కార్డులు త్వరితగతిన లబ్దిదారులకు అందించాలన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, పరిశుభ్రత తదితర అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటికి వైద్య సిబ్బంది వెళ్లి వైద్య సేవలు నిర్వహిస్తున్నారన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం రైతులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖాతిజున్ కుప్రా, ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ కిరణ్ కుమార్, సర్పంచ్ గంగులమ్మ, ఆర్‌బికే చైర్మెన్ నీలభాస్కర్, కోఆప్షన్‌మెంబర్ మహబూబ్‌బాషా, సింగల్‌విండో అధ్యక్షులు శ్రీధర్ రాయల్, ప్రత్యేక ఆహ్వానితులు నాగరాజ, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ నరసింహులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు విద్యార్థులకు స్పోర్ట్స్ మెరిట్ స్కాలర్‌షిప్



విద్యార్థులకు స్కాలర్‌షిప్ చెక్కులను అందజేస్తున్న కరస్పాండెంట్ గురుప్రసాద్

మదనపల్లె : పట్టణంలోని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ఐదుగురికి తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ నుంచి స్పోర్ట్స్ మెరిట్ స్కాలర్‌షిప్ అందినట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్.ఆర్. గురుప్రసాద్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023- 24 విద్యా సంవత్సరానికి తమ కళాశాల నుంచి అంతర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొన్న ఎం. మైత్రేశ్ సాయి (హాకీ), బి గంగాధర్ (హాకీ), ఏ మనోజ్ఞ (హాకీ), బి రేణుక (చెస్), ఎం. నవ్య (వాలీబాల్) ఉత్తమ ప్రతిభ కనపరిచినందుకు ఎస్వీ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ఎం శివకుమార్ రెడ్డి ఒక్కో విద్యార్థికి రూ. 6000 చొప్పున చెక్కులు అందజేశారన్నారు. క్రమశిక్షణ, ఉత్తమ విద్యా బోధనతో పాటు, క్రీడల్లో కూడా తమ విద్యార్థులు రాణిస్తున్నందుకు గర్వకారణంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్ రమాదేవి, వైస్ ప్రిన్సిపల్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలన మనందరి బాధ్యత

వాల్మీకిపురం: నులిపురుగుల నిర్మూలన మనందరి బాధ్యత అని అన్నమయ్య జిల్లా ఆరోగ్యశ్రీ డీసీ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. శుక్రవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా చింతపర్తి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగుల వల్ల రక్తహీనతకు గురై మన శారీరక మానసిక పెరుగుదల కుంటు పడుతుందని, మెదడు చురుకుగా పని చేయాలంటే రక్తహీనతకు గురి కాకుండా సంవత్సరంలో రెండు సార్లు ఈ మాత్రలు తినాలని సూచించారు. అలాగే స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నులిపురుగు మాత్రలపై అవగాహన కల్పించి, మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి, అధ్యాపకులు సుదర్శన్, నారాయణస్వామి, సుబ్రహ్మణ్యం, జ్యోతి, రేణుక, విజయలక్ష్మి, డాక్టర్ వసీమ్, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, సిహెచ్‌వో ఇందిరా పాల్గొన్నారు.

పీలేరురూరల్ : ఆరోగ్యమైన జీవితానికి ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నిర్మూలన ఉత్తమమైందని డాక్టర్ కార్తీక్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలోని మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ స్కూల్‌లో నులిపురుగుల నిర్మూలనకు విద్యార్థినులకు అల్బెండజోల్ మాత్రలు మింగించారు. మండలంలో 9971 మందికి మాత్రలు వేయడం లక్ష్యం కాగా 9173 మందికి పంపణీ చేసినట్లు తెలిపారు. సర్పంచ్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ అమరనాథరెడ్డి, ప్రిన్సిపాల్ రాధారాణి, సీహెచ్‌వో జయలక్ష్మి, పాల్గొన్నారు.

కేవీపల్లె : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా గర్నిమిట్ట పీహెచ్‌సీ పరిధిలో 2781 మందికి అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ రేష్మ తెలిపారు. శుక్రవారం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం 3146 మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేయడం లక్ష్యం కాగా 88 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు.

తంబళ్లపల్లె: మండలంలో డీవార్మింగ్ డే (నులిపురుగు నివారణ దినం) సందర్భంగా పిల్లలకు అల్‌బెండోజోల్ మాత్రల పంపిణీ చేశారు. కోసువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ అనుపమ ఆధ్వర్యంలో మండలంలో 19 ఏళ్ల పిల్లలు 5625 మందికి గాను 5412 మందికి అల్‌బెండోజోల్ మాత్రలు మింగించి 96 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు.

కలకడ : నులిపురుగుల నివారణతోనే చిన్నారులలో శక్తి పెరుగుతుందని కలకడ, ఎర్రకోటపల్లె పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ కిషోర్‌కుమార్ రెడ్డి, డాక్టర్ మోహన్ తెలిపారు. శుక్రవారం జాతీయ నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకుని 96 శాతం మందికి మాత్రలు మింగించారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

తంబళ్లపల్లె: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం రేణుమాకులపల్లె ఉన్నత పాఠశాలలో 2వ విడత జగనన్న సురక్ష కార్యక్రమంలో డాక్టర్లు మునికుమార్, తేజశ్వి, వంశీరెడ్డిలు 398 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే ఉచితంగా మందుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మహేష్, సర్పంచులు మహ్మద్ అలీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలను జాగ్రత్తగా నడపాలి



ర్యాలీలో పాల్గొన్న ఎంవీఐ, ఆర్టీసీ సిబ్బంది

మదనపల్లె సిటీ: డ్రైవర్లు వాహనాలను జాగ్రత్తగా నడపాలని ఎంవీఐ శివలింగయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ-1,2 డిపోల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు నియమ,నిబంధనలు పాటించాలన్నారు. వాహనాలు నడిపే డ్రైవర్లు మద్యం సేవించడం చేయకూడదన్నారు. ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయడం సురక్షితమన్నారు. డ్రైవర్లకు శిక్షణ ఇవ్వడమే కాకుండా వారికి ప్రత్యేకంగా డ్రైవింగ్‌లో మెల కువలు నేర్పించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి కృష్ణదేవరాయ సర్కిల్ వరకు ర్యాలీ చేసి మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం నిరంజన్, టు టౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య, ఆర్టీసీ ఏడీఎంలు రేవతి, గీత, ధాత్రి ఫౌండేషన్ స్వాతి, జ్ఞానాంబిక కళాశాల, జ్ఞానోదయ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.